ప్రియమైన రఘూ గారికి,

అనురాగ సుమాంజలి


నేను మీకు చాలా కాలంగా ఒక విషయం రాద్దామనుకుంటున్నాను [ముఖ్యంగా మీరు నన్ను... "ఐ వాంట్ లైఫ్ విత్ యూ అండర్ వన్ రూఫ్" అంటూ తొందర చేస్తున్నప్పటి నుండీ! కానీ మీకు ఏ విధంగా చెప్పాలో తోచక ఇన్నాళ్ళూ జాప్యం చేశాను. కానీ నిన్నటి మీ నిర్ణయం... ఈ రోజు నన్ను ఇలా రాయించేస్తోంది]

మీరు పెళ్ళయిన వారు. మీకు మీ భార్యతో సుఖం ఉందా లేదా అనేది అప్రస్తుతం! మీకు భార్యా పిల్లలు, తల్లి దండ్రులూ, అన్నదమ్ములూ, అక్క చెల్లెలూ అందరూ వున్నారు. మీరు ఎవరిని లెఖ్ఖ చేసినా, చేయకపోయినా భార్యా పిల్లల్ని దూరం చేసుకోలేరుగా! ఆమెని అన్యాయం చేసి నన్ను చేపడతానని కూడా మీరన్నారు. నాకు అది ససేమీరా ఇష్టం లేదు. ఆవిడ నిండు బతుకుని బలి తీసుకునేంత ద్రోహం ఒక ఆడదానిగా నేనస్సలు చేయలేను. ఇక మిగిలిన మార్గం ధైర్యంగా మీతో వచ్చేసి... మీతో కలిసి జీవించడం! కానీ భార్య వుండగా.. మరో స్త్రీతో ఎవరైనా మగవాడు జీవితాన్ని పంచుకుంటే... ఆ స్త్రీని మన సమాజం ఏమంటుందో మీకు తెలుసా...? తెలియకపోతే వినండి... "ఉంపుడు కత్తె" అంటారు. ఆ పేరులోనే ఎంత అసహ్యం దాగి వుందో చూడండి. జీవితాన్ని పంచుకునే 'స్త్రీ'ని "సతి" అని "ఇల్లాలు" అని "గృహిణి" అని గౌరవించే ఈ మనుషులే... రెండవ స్త్రీని జీవితం పంచుకున్నా కష్టనష్టాలకు ఓర్చుకున్నా, చేదోడువాదోడగా వున్నా... ఫలానా ఆయన "ఉంపుడు కత్తె" అనే అంటారు. ఇంకా చెప్పాలంటే "ఉంచుకున్నది" అంటారు ఘోరంగా!

అంగీరస ఉగాది కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ

# ద్వితీయం

ఓ. కౌసల్యాదేవి




**మీ** వల్ల ఎంత ప్రేమ వున్నా నేనది భద్రంగా గుండెల్లో దాచుకుని ఒంటరిగా జీవించగలను. కానీ పొరపాటున కూడా ఈ "ఉంచుకున్నది" అనే మాట విని భరించుకోలేను. నా వల్ల కాదు. కారణం కుటుంబంలోనే నా చిన్నతనంలో, నా కళ్ళెదురుగా జరిగిన ఓ సంఘటన.

మీకు తెలును మా నాన్నగారు పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఇన్‌స్పెక్టర్‌గా చేసేవారు. అందంగా - ఎత్తుగా, ఎత్తుకి తగ్గ లావుతో హుందాగా వుండేవారు. అమ్మ చామనఛాయతో కొంచెం పొట్టిగా నల్లని కళ్ళతో కళకళలాడుతూ వుండేది. మా ఇంట్లో అమ్మమాట వేదవాక్కు. ఇంటినంతటినీ శాసించగల సామ్రాజ్ఞి. నాన్న సంపాదనంతా నెలనెలా చిల్లిగవ్వయినా ముట్టు కోకుండా అమ్మ దోసిట్లో పోసి, తన అవసరాలకు అమ్మ ఎంత ఇచ్చినా తృప్తిగా స్వీకరించేవారు. ఎంత మాటా...మాటా... అనుకున్నా అన్నీ మరిచిపోయి తనే ముందుగా మాట్లాడించేవారు. తన జీవిన సహధర్మచారిణిగా, తన ఇల్లాలిగా, తన గృహలక్ష్మిగా, తన పిల్లల తల్లిగా, అమ్మకు ఎప్పుడూ గౌరవం ఇచ్చారు. ఆవిడకు "ఏ లోటూ రానివ్వలేదు". అంతిమ శ్వాస ముగించే వరకు! కాని ఆమెకు నాన్న కలిగించిన అశాంతి ఒక్కటే... ఇదే ప్రతి స్త్రీని... కనీసం కొద్ది రోజుల కోసమైనా తనకు చెల్లెలు చేయటం! కాని ఏం లాభం! నాన్న ఏనాడూ... ఒక్క ఈ విషయంలో... అమ్మ కన్నీటికి... అమ్మ మాటకు విలువ ఇవ్వలేదు! నిర్లక్ష్యంగా నవ్వేవారు.

ఇక యశోధ పిన్ని! నాన్నగారితో పాటు ఓ నాలుగు రోజులు కలిసి భోజనం చేసిన ఒక. బ్రాహ్మణ పూజారి భార్య. యశోద పిన్ని... సామాన్యమైన అందగత్తె... కాని అందాలకు నిలయాలైన కళ్ళతో అందరి హృదయాలను దూరగొనేది! నక్షత్రాలకు మల్లే మిల మిలా మెరిసే కళ్ళు... అమాయకంగా, ఒక్కోసారి చిలిపిగా తళుకులు కురింపించే కళ్ళు! నేను 7 ఏళ్ళదాన్ని... ఇప్పుడే ఇంతింత మాత్రం తెలిసే ఆ దాంపత్య విషయాలు అప్పటికి నాకు రూపాయిలో నయాపైసా విలువైనా తెలియవు.

ఉన్నట్టుండి ఓ నెల రోజులు ఇంటికి రాలేదు నాన్న! ఉత్తరాలు మాత్రం రెగ్యులర్‌గా ఏ మాత్రం ఆలస్యం కాకుండా వెంట వెంటనే వస్తున్నాయి. క్షేమంగా ఉన్నట్టూ... పని ఎక్కువగా ఉన్నట్లు! కాని అమ్మ అనుమానం వేరే! కన్నీటికి ఆనకట్ట వేయలేకపోయేది. నాయనమ్మ, అక్కయ్యలు, ఇరుగు పొరుగు వారు ఎంతో ఓదార్చేవాళ్ళు కంటికైనా కనిపించని ఆ వ్యక్తిని, ఆ వ్యక్తిని ఎంత నీచంగా, ఎంత హీనంగా తిట్టేవాళ్ళో చెప్పలేను! మెదట్లో అన్ని రోజులు నాన్నగారు కన్పించకపోయేసరికి బిక్కచచ్చిపోయాను. క్రమంగా తెలిసింది... అక్కడో

పిన్ని వుందనీ... యశోద అనీ... అందుకే రావడం లేదనీ...! అమ్మ కన్నీళ్ళు చూస్తే..। అ క్షణాన నాకు కనిపించని పిన్నిని నరికి పోగులు పొయ్యాలనిపించేది. నాన్నను తిట్టుకునేదాన్ని! హఠాత్తుగా ఓ రోజు సాయంత్రం నాన్నగారు వచ్చారు. నేనూ...చెల్లి... తమ్ముడు మాత్రం సంబరపడ్డాం. అమ్మ అసలు నాన్నకు ఎదురుపడలేదు. నాయనమ్మ తిట్టని మాటలు లేవు. యశోద పిన్నిని కూడా కలిపే తిట్టింది... బాగా తిడుతుందిలే అనుకున్నాను. పెద్దక్కయ్యలూ సరిగ్గా మాట్లాడలేదు! ఎందుకో నాకు సరిగ్గా అర్థం కాలేదు...! రాత్రి కాగానే కడుపునిండా తిని... నాన్నగారి మంచం మీదే హాయిగా నిద్రపోయాను! ఎలా మెలుకువ వచ్చిందో నాకు తెలియదు గానీ...అమ్మ మంచం దగ్గరగా వున్న



స్థంభాని కానుకొని... నాన్నను ఏవేవో అడుగుతోంది ఏడుస్తూ. నాయనమ్మ ఎదురుగా నేలమీద కూర్చుంది. ఇద్దరక్కలు నాన్న మంచం మీదే కూర్చున్నారు.

నాన్న మంద్రస్వరాన చెపుతున్నారు. "అలాంటిది కాదు! ఏదో అనుకోకుండా మా ఇద్దరి వల్లా పొరపాటు జరిగిపోయింది గానీ... "ఆమె దేవతలాంటిది! బ్రాహ్మణ స్త్రీ..."

నాన్న మాటను మధ్యలోనే త్రుంచి- "దేవత లాంటిది కాబట్టే మొగుడుండగానే... వాటుగా కులికి, చచ్చి నాలుగు రోజులు కాకముందే... రం...మొగుడి వెంటే వచ్చేందుకు తయారవుతుంది...నిజమే..., దేవతే మరి".. హేళనగా అంది.

నాన్న ముఖం ఎర్రబడింది..... "దేవతే! కాకపోతే.... నా ఆవేశాన్ని... క్షమించి... నా వెంట వస్తూంది. లేకపోతే పది మందిలో నీ భర్త పరువేమైపోయేదో... అన్నిటికీ మించి ఆమె.... [ప్రపంచంలో అందరికన్నా ఎక్కువగా] నన్ను ప్రేమిస్తోంది.... "మళ్ళీ మధ్యలోనే అందుకుంది. 'ఔను మరి! అలాంటిది ప్రేమిస్తున్నానని చెప్పుకోక అసలు సంగతి చెపుతుందా-?" "ఇంతకూ మీదెన్నో నెంబరు-?? మీతో ఎన్నాళ్లుంటుంది - ?" అని.... వెంటనే నాయనమ్మ "ఛీ తెగించిన ఆడది.... ఒక్కడి దగ్గర నియమంగా ఉంటుందా?" మోజు తీరగానే రెక్కలు విప్పి ఎగిరిపోతుంది. ఇట్లాంటి వాళ్లకు ఇంకా ప్రేమలు కూడానా-? అంది! అక్కయ్యలిద్దరూ... ఒకర్నొకరు చూసుకుని ముసి ముసిగా నవ్వుకుంటున్నారు! నాన్న ఆవేశం పెరిగిపోయింది.... పిడికిలి బిగించి.... "ఎక్కువగా ఎవ్వరూ మాట్లాడవద్దు.... ఎవ్వరెన్ని చెప్పినా... నేను.... అమాయకంగా నన్ను నమ్మిన స్త్రీని మోసం చేయలేను. రేపు ఆవిడ వచ్చిన తరువాత కూడా ఇలాగే ప్రవర్తిస్తే..... నన్ను శాశ్వతంగా దూరం చేసుకున్నవారౌతారు.." అంతే అన్నారు.

నాయనమ్మ ఒక్కసారిగా గొల్లు మంది.... శనిని తీసుకొచ్చి ఇంట్లో పెడతానంటావేమిటీ.... అర్థమైన భోగం "వాళ్లనుంచేందుకు ఇది సానికొంప అనుకున్నావా-? మగవాడివి నీకు లేకపోయినా.... ఆ వచ్చే ముండకు ఎలా లేకపోయింది సిగ్గు! ఐనా ఎలా వస్తుందో నేనూ చూస్తాను. చీపురు తిరగేసి సింగారిస్తాను. లం....."- ఎలా వ్రాయనూ ఆ మాటలు....! ఎన్నో అంటున్నారు అందరూ! చటుక్కున లేచి బయటకు వెళ్లారు నాన్న.. ఉలిక్కిపడి నేనూ అనుసరించాను! ఆవేశంగా గుర్రాన్ని [కళ్యాణీ... పేరు తెలుగే కాని ఉర్దూయే దానికర్థమయ్యేది] విప్పుకుంటున్నారు... ఒక్క పరుగున వెళ్లి నాన్నా అని కాళ్లకు చుట్టేసి బావురుమన్నాను! జేవురించిన మొహంతో, ఎర్రబడిన కళ్లతో నాన్న నా వైపు చూసి నన్నూ గుర్రం మీదకి లాక్కున్నారు. ఎందుకో నాకనిపించింది.... ఆ.... దయ్యందగ్గరికే నాన్న వెళ్తున్నారని... అప్పుడు నా దృష్టిలో నాన్నను మానుండి వేరు చేసిన రాక్షసి- పిన్ని! అందుకే "పిన్ని దగ్గరకా-?" అన్నాను. నాన్న సమాధానం చెప్పేలోగా అమ్మ వినురుగా వచ్చి" దాన్నెందుకు-? ఆ సానికొంపకి. అంతగా దాన్ని తెచ్చుకోవాలని ఉంటే మా కందరికీ మీ చేత్తోనే తలా కాస్త విషం పెట్టండి. పీడా పోతుంది. తర్వాత అదీ మీరు ఛల్ మోహన రంగా... అంటూ ఉండవచ్చు!.... 'అరుస్తూనే ఉంది.... అమ్మ గుర్రానికి అడ్డంగా నిలబడి వక్కింటి పుల్లయ్యా.... ఎదురింటి రాములమ్మత్త అందరూ లేచారు. నాన్నకు ఏమనిపించిందో గానీ.... అవుకో లేని అసహ్యంతో ముందుకు వంగి అమ్మను ఓ ప్రక్కకు లాగి... గుర్రాన్ని ఒక్క తన్నుతో దౌడు తీయించారు. వెనుక నుండి పుల్లయ్య తాత, రాములత్త, "హయ్యో.... ఇదేం పిదపకాలం వచ్చింది చంద్రయ్యకు, అయినా నీకేం కమలమ్మా... ఎత్తుకొచ్చిన దానివా? ఏడ్చుకుంటూ వచ్చిన దానివా-? లక్షణంగా తాళి కట్టినాడు.... రేపు పది మందిలో ఏం జవాబు చెప్తాడో చూద్దాం....! అయినా అదెంత సిగ్గులేని లం...." నాకు.... చాలా దూరం వరకు ఆ మాటలు వినిపిస్తూనే ఉన్నాయి....! క్రమంగా గుర్రం వేగం తగ్గింది. సాధారణంగా నడుస్తూంది. ఊరు వదిలి చాలా సేపైంది! నేను నెమ్మదిగా "పిన్ని దగ్గరికేనా" మళ్ళీ అడిగాను! ఈసారి నాన్న కళ్లల్లో తళుక్కున మెరిశాయి నీళ్లు! "ఔనుగానీ.... పిన్ని చాలా మంచిదిరా! నీకు ఎన్నో కథలు చెప్తుంది...! అంటూ ఊరిస్తూ గొప్పగా చెప్తున్నారు. కాని... నా చిన్న మనసులో నుండి... నాన్నను మా నుండి వేరు చేసిన దుర్ఘటన.... చెరిగిపోలేదు. పైగా అమ్మా, నాన్నమ్మ, ఇరుగు పొరుగులు ఇచ్చిన బిరుదులూ మరిచిపోలేదు / అందుకే అతి నిర్లక్ష్యంగా "కాదు నాన్న అది దెయ్యం!' అన్నాను. కాని నాన్న "చూస్తావుగా... దయ్యమో, దేవతో".. ఆవిడని కలుసుకోబోతున్నాననే సంతోషం నాన్న కళ్లల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

హఠాత్తుగా ఆగిపోయింది కళ్యాణి... విపరీతంగా సకిలిస్తూ.... నాన్న ఉలిక్కిపడి నన్ను పూర్తిగా తన గుండెల్లోకి ఇముడ్చుకొని.....'దౌడో.... రుక్ నా నహీ!" లాటి మాటలేవో... దాని చెవి దగ్గరగా వంగి అంటుండగానే... దిక్కులు పిక్కటిల్లేటట్లు : 'ధాం' అనే భయంకర శబ్దం... దాని వెంటనే 'అబ్బా'... అని నాన్న ఆర్తనాదం కలిసి ధ్వనించాయి! గుర్రం క్షణం సేపు... అటూ... ఇటూ ముందటి కాళ్ల మీద ఎగిరి. ఒక్క ఉదుటున పరుగు లంకించుకుంది! చాలా సేపటి వరకు విపరీతమైన భయంతో... నాన్న గుండెలకు అలాగే అతుక్కుపోయి ఉన్న నేను... క్రమంగా నాన్న నా మీదకి ఒరిగిపోతూండడం, నా చుట్టూ ఉన్న నాన్న చేయి పట్టు సడలడమూ గమనించి వెర్రి భయంతో.. మెడ వెనక్కి త్రిప్పి.... నాన్నా నాన్నా అని పిలిచాను... దాదాపు

అరిచాను! మత్తుగా వాలిపోతున్న కళ్లను బలవంతంగా పైకి లేపి "భయపడకురా... నాకేమీ కాలేదు పులి బిడ్డవి... పులిగానే ఉండాలి!" నీరసంగా నవ్వారు.

నాన్నాకేమైంది-? వంగి ఒక చేత్తో కాలెందుకు పట్టుకున్నారు-? అయినా గుర్రం ఏమిటి ఇలా శివం ఎత్తినట్లు పరుగెత్తుతోంది. నా ఆలోచనలకు ముగింపన్నట్లుగా నాన్న నన్ను కాస్త ముందుకు జరిపి కళ్లాలు నతా చేతికిచ్చి... "భయపడకురా... ఏం... లేదు.... భయపడకు జాగ్రత్తగా వెళ్లు" అంటూనే గుర్రం మీద పూర్తిగా వొరిగిపోయారు. కెవ్వుమన్నాను నేను! కాని ఆయన కాస్తయినా కదలలేదు. గుర్రం మాత్రం కొంచెం వేగం తగ్గించి... నేర్పుగా, నాన్నగారు కిందకు జారకుండా జాగ్రత్తగా పరుగెత్తుతూంది. ఐదు నిముషాల్లో అతి నిశ్శబ్దంగా ఉన్న ఓ పెంకుటింటి ప్రాంగణంలో ఆగింది గుర్రం పెద్దగా సకిలిస్తూ! ఉత్తర క్షణంలో తలుపు తెరచుకోవడం ఒక ఆడమనిషి ఒక్క ఉదుటున దగ్గరకు రాబోయి గుర్రం ఉన్న పద్ధతినీ, నన్నూ, నాన్న పరిస్థితినీ చూసి కాబోలు కెవ్వుమంది. అంతవరకూ ఉగ్గపట్టుకున్న ఏడుపు, ఇంకో మనిషి కనిపించడంతో నాలో కట్టలు తెంచుకుంది! భోరుమన్నాను.

క్షణంలో సర్దుకుంది ఆవిడ! వెంటనే రెండు చేతులూ చాచి నన్ను గుర్రంమీద నుండి అందుకుంది. తెల్లగా... వెన్నెల రేఖలా... నల్లని కళ్లతో చురుకుగా నావైపు చూసి నంజవి కదూ! అంది. నాకు నిజం... చాలా సంతోషం అనిపించింది. అందమైన ఆ కళ్లలోకి అలాగే చూస్తూ ఉండాలనిపించింది. ఆమె మాట స్వచ్ఛంగా ఉంది. మా అందరికిలా లేదు యాసగా! కంఠం కూడా ఎంతో తీయగా ఉంది. "పిన్ని! పిన్ని... నిజంగా దేవతే! దేవతేమిటి... ఛ... దేవతలకి దేవత!" ఔనని తలూపుతూ ఏమో చెప్పబోయాను. కాని ఆవిడ నన్ను అలా అడుగుతూనే నాన్న భుజాల చుట్టూ చేయి వేసి మొహం కొద్దిగా పైకెత్తి విపరీతంగా చలించిపోయిన కంఠంతో "ఏమండీ?" అంది. కళ్లలో నీళ్లు ధారలు కడుతున్నాయి. నాన్న కొద్దిగా కదిలారు. ఆవిడ చటుక్కున నావైపు చూసి "నంజా... తలుపు పూర్తిగా తెరిచి పెట్టు... ఊఁ" అంది. ఎంతో పరిచయమున్న వ్యక్తికి ఎంతో చనువుగా పని చెప్తున్నట్లే ఉంది. మరుక్షణంలో ఆ పనిలో మునిగిపోయాను! నాన్నను ఆవిడ లోపలికెలా తీసుకొచ్చారో తెలియదు! నాన్న గదిలోనే నాకూ పడకేసి పడుకోమంది. అలసిపోయిన నా కన్నులు మూతబడే ముందే... ఇంట్లో ఏదో సందడిగా చాలామంది హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నట్లూ అనిపించింది. బయట కోడి కూసింది తెల్లవారిందన్నట్లు! నిద్ర పట్టింది.

నుదురు మీద ముద్దు స్పర్శతో కళ్లు తెరిచిన నేను బుగ్గల మీద ముద్దుల ముద్రలతో ఉక్కిరి బిక్కిరైపోయాను. "లే! నాన్న పిలుస్తున్నాను. రా!" అంటూ ఆవిడ లేపుతోంది. ఎంత అందంగా ఉంది ఆవిడ నవ్వు! వెన్నెల చిందినట్లుగా ఎంత హాయిగా ఉంది! ఈవిడనా దెయ్యం అనీ, లం... అనీ, దరిద్రపుముండా! అని వాళ్లు తిట్టేది. ఛ అనిపించింది.

నాన్న మంచంమీద పడుకుని ఉన్నారు. చాలా నీరసంగా ఉన్నారు. కాలికి ఏదో కట్టు! నన్ను చూస్తూనే ఒక చేయి చాచి దగ్గరకు తీసుకున్నారు. "ఈవిడెవరో తెలుసా! పిన్ని!" అన్నారు నాన్న. నాకెందుకో సిగ్గుగా



వాడు అన్నీ అమ్ముకొని బాగుపడితే వీడు అన్నీ కొని నష్టపోయాడా?. ఆశ్చర్యంగా ఉందే? ఇంతకీ ఏమిటది?

ఏవిటా? లాటరీ టిక్కెట్లు!

బోనేపల్లి ఝాన్సీ, తెనాలి

ఉంది ఆవిడవైపు చూసేందుకు! "ఇదిగో చూడు... ఇప్పుడు చెప్పు. పిన్ని దేవతా, దెయ్యమా?" అంటున్నారు నాన్న. అనుకోకుండానే నానోట "దే...వ...త!" అని వెలువడింది. ఆవిడ ఆశ్చర్యంగా నావైపు, నాన్నవైపు నల్లకలువల్లాంటి కళ్లతో మార్చి మార్చి చూస్తోంది. హఠాత్తుగా తీయగా నవ్వుతూ "బావుంది. దానికేం తెలుసు? నేను దయ్యాన్నో దేవతనో? ఐనా ఎంత దురదృష్టవంతురాలిని కాకపోతే నా కోసం వస్తూ మీరిలా ప్రమాదపడ్డారు! పసిపిల్ల సంజకేం తెలుసు. లోకంలో ఒక్కమాటు అడగండి. నేనెవరో చెబుతారు. కులట అనీ... పతిత అనీ!" అంటూనే ఆవిడ ఒక్కసారిగా ఆగిపోయి "పోనీలెండి. ఇప్పుడెందుకవన్నీ. మీరు కొంచెం విశ్రాంతి తీసుకోండి. అప్పటికి పాప మొహం కడుక్కొని వస్తుంది. తీరిగ్గా మీ దయ్యం కబుర్లు చెబుదురు గానీ!" అంటూ నా చేయి పట్టి లేపింది. క్షణక్షణానికీ నా ఆశ్చర్యం ద్విగుణీకృతం అయింది. ఔతోంది! అచ్చు పుస్తకాల్లో ఉన్నట్లుంది పిన్ని మాట. అసలు నాన్నకేమైందో అన్న ఆలోచన మళ్ళీ నా మనసులోకే రాలేదు. నాన్నకు పిన్ని ఎంతో సేవ చేస్తుంది. మొహం కడగడం, బట్టలు మార్చడం, అన్నం తినిపించడం, చివరకు తల దువ్వడం, కాళ్లు పత్తడం॥ అన్నీ చేస్తుంది. అమ్మ కూడా చేస్తుంది నాన్నకు సపర్యలు. కాని ఇలా ఉండవు. అమ్మ ఎప్పుడూ నాన్నకు తల దువ్వలేదు. భోజనం చేయించలేదు. అమ్మ ఎందుకో మరి నవ్వుతూనే చిరచిరలాడేది. నాన్న ముభావంగా అయిపోయేవాడు. కాని పిన్ని అలాకాదు. చెదరని చిరునవ్వుతో మధురంగా మాట్లాడుతూ అన్నీ చేస్తూంటే... నాన్న ఏదో కొంటెగా అనడం. చిలిపిగా చూడడం, పిన్ని సిగ్గుతో కందిపోవడం॥ ఏమీ తెలియని ఆ పసివయసులోనే నాకు ఎంత ముచ్చటగా ఉండేదో!

అసలు సంగతి! పిన్ని భర్త ఉండగానే అనుకోకుండా నాన్నగారికి వశమైపోయింది. సర్వం త్యజించి వచ్చేసింది. సురక్షితమైన స్థలంలో ఉంచి అప్పుడప్పుడు వెళ్తుండేవారట నాన్న! హఠాత్తుగా ఆమె భర్త చనిపోయారు. వెంటనే నాన్న పిన్ని దగ్గరే నెల రోజుల పాటు ఉండిపోయారు. ఇంటికి తీసుకెళ్తానని నచ్చచెప్పారు. ఇంట్లో వాళ్లతో ఘర్షణ పడి వస్తూ ఎవడో దొంగవెధవ... కాల్చిన పిస్టల్ గుండు కాలికి తగిలి ప్రమాదంలో పడ్డ నాన్నను పిన్ని కాపాడుకుంది. సేవచేసి దక్కించుకుంది. పోనున్న ప్రాణాలు నిలిపింది.

నాన్నకు నెమ్మదించగానే పిన్నితో సహా ఇంటికి వచ్చేశాం. పిన్ని దగ్గర చాలా డబ్బుండేది! ఎప్పుడూ నాన్నను ఏమీ అడిగేది కాదు. పిన్ని వచ్చిన తరువాత మా ఇంటికి లోకులు తీర్థంలా వచ్చారు. వచ్చిన ప్రతివారు పిన్ని ముందు "అయ్యో పాపం..." అంటూ, ఏదో జాలి చూపడం. తర్వాత అమ్మ ముందుకు వచ్చి "ఎంత కష్టం వచ్చింది పాపం! కమలమ్మ కాబట్టి సహిస్తుంది. కాని ఎవరైతే మాత్రం ఇంతటి అఘాయిత్యాన్ని ఎలా సహిస్తారు! ఏం చేస్తావు కమలమ్మా! బాధపడకు. మంచి వాళ్లకే కష్టాలన్నీనూ! అయినా ఎన్నాళ్లు ఉంటుందిలే? చూస్తే మెరుపుల గురిగిలాగే ఉంది." ఎన్ని మాటలో... కొన్ని మాటలు పిన్ని చెవుల్లో కూడా పడేవి. ఒక్కోసారి పిన్ని ఏడుస్తూ కూర్చునేది / నాకు ఏడుపొచ్చేది! ఏం చేసింది పిన్ని? ఎందుకు వీళ్లంత పిన్నిని తిడతారు. ఇప్పుడు అమ్మకేమైంది? అమ్మమీద. ఇంత సానుభూతి ఎందుకు? తన్నుకు చచ్చినా నాకు అర్థమయ్యేది కాదు. రోజులు గడుస్తున్న కొలదీ ఇరుగు పొరుగులూ, అమ్మ, నాయనమ్మ పిన్నిని సూటిగానే అనడం మొదలెట్టారు. పిన్ని ఏం జరిగినా నాన్నకు చెప్పేది కాదు. కొన్నిసార్లు నేను నాన్నకు చెప్పి అమ్మతో తన్నులు తిన్నాను.

రెండే రెండు నెలలు గడిచాయి! ఆ రోజు నాకు బాగా జ్ఞాపకం ఉంది. ఆరుద్ర పురుగులు ఏరుకుని అగ్గిపెట్టెనిండా నింపుకుని హుషారుగా గుమ్మంలో అడుగుపెట్టిన నేను "ఓహో... ఇంతవరకు వచ్చిందా వ్యవహారం?. వదిలిపెడితే వెళ్లిపోయేందుకు నేనేం లేచి వచ్చినదాన్నా? నాకేం దిక్కు లేదా? ఇంటికి రాకుండా బెదిరిస్తే భయపడడానికి నాకేం ఖర్మ? ఎక్కడున్నా 'రామచంద్రయ్య పెళ్ళాం' అనే అంటారు. ఆయన ముద్దుల యశోదకే దిక్కులేదని చెప్పండి. తను వదిలి పెట్టగానే నన్ను కట్టుకునేందుకు ఇంకే రామచంద్రయ్య లేడు. నేను యశోదనూ కాదు! అందం చూపించి లేచిపోయేందుకు నాకు పిల్లలున్నారు?" ఏమేమో అంటోంది అమ్మ. ఎందుకో పిన్నినలా ఇంకో మనిషి ముందు అమ్మ తిడుతూ ఉంటే ఆ వచ్చిన మనిషి నవ్వుతూ ఉంటే నాయనమ్మా, మిగతా అందరూ తమాషాగా చూస్తూంటే... పిన్ని అవే అమాయకమైన కళ్లతో నిస్సహాయంగా నిలబడి ఉంటే నానేమాత్రం సహించలేకపోయాను. పెద్దగా "అమ్మా! నాన్న రానీయ్! నేను ఇవన్నీ చెబుతా. ఇంకా అబద్ధాలు కూడా చెబుతా: నువ్వు, వీళ్లంతా కలిసి పిన్నిని కొట్టారని చెప్పకపోతే నా పేరు సంజే కాదు" ఉక్రోషంగా అరిచాను.

అమ్మ చటుక్కున నా చేయి పట్టుకుని బలంగా లాగి "దొంగముండ? ఎన్ని మందులు నేర్చిందో! చిన్నపిల్లను కూడా మాయ చేసింది!" అని "ఏం బుద్ధి పుట్టిందే నీకు?" చెంపలు ఛెళ్ ఛెళ్‌మన్నాయి! గాభరాగా పిన్ని నా దగ్గరకు పరుగెత్తుకు వస్తూంటే... "దాని పిల్లను అది కొట్టుకుంటూంటే... మధ్యలో నీ కెందుకు. వగలమారి ప్రేమలు బాగానే వస్తాయి!" అంది నాయనమ్మ అడ్డుపడుతూ. చలించిపోయినట్టుగా చూసిన పిన్ని ఒక్క పరుగులో తన గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకుంది. వెక్కి వెక్కి ఏడుస్తూన్న శబ్దం వినిపిస్తూనే ఉంది. మొదట కొట్టి, తరువాత బుజ్జగించి అన్నం పెట్టి వదిలింది అరగంట తరువాత అమ్మ నన్ను. అంతలో నేనీ విషయాన్నే మరిచిపోయాను. దీపాల వేళ హఠాత్తుగా పిన్ని జ్ఞాపకం వచ్చి పరుగెత్తాను. ఆత్రంగా దగ్గరకు లాక్కుంది. బుగ్గలన్నీ ముద్దులు పెట్టి "నా కోసం దెబ్బలు తిన్నావు కదా!" అంది కళ్ళనీళ్ళు

పెట్టుకుంటూ. "ఛ! ఏడవకు పిన్నీ... దెబ్బ తగల్లేదు" అన్నా. కాని నా కెందుకో ఇంత మంచి పిన్నిని అందరూ ఎందుకిలా హింసిస్తారో తోచలేదు. హఠాత్తుగా మాటలు వినిపించి ఉలిక్కిపడి లేచాం ఇద్దరమూ.

ఎదుటి గదిలో తులశమ్మత్త అంటూంది "ఆ మధ్యన పిస్తోలు గుండు తగిలిందటగా... ఎంతైనా మాంగల్యం గట్టిది కమలమ్మా. లేకపోతే ఎవరెంత సేవ చేస్తే మాత్రం ప్రాణాలు పోయగలరా! ఇదంతా నీ కుంకుమ అదృష్టం. నీ చేతి గాజుల బలం. అంతే. లేకపోతే చచ్చే మనిషి బ్రతికి బయట పడడమంటే మాటలా! నీ జాతకం, నీ ముత్తైదువతనం గొప్పది" అంటూ తేల్చేసింది ఆవిడ. నిజంగా నాకు వళ్ళు మండిపోయింది. నాన్నకు పిస్తోలుగుండు తాకితే అమ్మ పుస్తెలు, గాజులు, కుంకుమ అడ్డంపడ్డాయా? అసలు అమ్మ అక్కడికి రానైనా వచ్చిందా! పిన్ని! పాపం పిన్ని... ఎంత అవస్థపడ్డది. అర్ధరాత్రి అంత పెద్ద గాయంతో ఇంటికి చేరిన వ్యక్తిని ఎంత జాగ్రత్తగా గుండెల్లో దాచుకుంది. ఎంత ధైర్యంగా పరిస్థితికి ఎదురు నిలిచింది. ఎంత సేవ చేసింది. ఎన్ని మందులు పెట్టించింది. ఏమేం చేసింది. అమ్మ ఏం చేసిందనలు? పిన్ని చేసిన పనిలో పీసమెత్తైనా చేయలేదు. మరి అమ్మ గొప్పదంటూందే విటి ఆవిడ? ఇంత చేసిన పిన్నికి విలువ లేదా? పిన్ని సేవకు బలమే లేదా? ఛ... నాలో నాకే అసహ్యమనిపించింది. పిన్ని కూడా అలా ఫ్రూస్పడిపోయి వింటోంది.

హఠాత్తుగా "సంజా! అమ్మ పిలుస్తోంది వెళ్ళూ..." అంటూ బయటకు తరిమి తలుపులు బిగించుకుంది. ఓ అరగంట తరువాత పిన్ని పిలిస్తే గదిలోకి వెళ్ళాను. దగ్గరకు తీసుకుని, గుండెలకు హత్తుకొని, బుగ్గల నిండా ముద్దులు పెట్టి, 'నాన్నగారు రేపు వస్తారు కదూ! మరే... రాగానే ఇది "పిన్ని ఇచ్చింది" అని ఎవరూ చూడకుండా ఇవ్వు అని ఓ చీటీ నా చేతిలో పెట్టింది. సరే అని భద్రంగా నా పుస్తకాల్లో దాచుకుని వచ్చాను. పిన్ని తనెందుకివ్వదో, నన్నెందుకివ్వమంటూందో... ఆ క్షణాన నాకు తోస్తే... ఈనాడు ఇలా మీకు వ్రాసే ఉత్తరంలో ఎలాంటి మార్పులుండేవో. కాని నాకు తట్టలేదు. పిన్ని సాధారణంగానే కథలు చెప్పింది. హఠాత్తుగా నవ్వే కళ్ళతో మరింత నవ్వుతూ... "ఒకవేళ నేను చచ్చిపోతే నన్ను మరిచిపోతావా?" అంది. అప్పుడప్పుడే రామాయణ, భాగవతాలు చదువుతున్న నేను చటుక్కున అన్నాను - "కృష్ణుని కన్నది దేవకే అయినా, తల్లి యశోదే అయిందీ పిన్నీ. నిజం! ఇకనుండి నిన్ను పిన్నీ అనను "అమ్మా" అనే అంటాను" అన్నాను. అత్యాశ్చర్యంతో దగ్గరకు లాక్కుని "సంజా" అని ఆవేశంగా ముద్దు పెట్టుకుంది.

ప్రొద్దున్న లేచేసరికి పిన్ని లేదు. అంత గాభరాపడుతూండగానే నాన్నగారు వచ్చారు. అంత అయోమయంగా ఉంది నాకు. హఠాత్తుగా జ్ఞాపకం వచ్చి పిన్ని ఇచ్చిన చీటీని తీసుకెళ్ళి... పిన్ని గదిలో శిలలా నిలబడిపోయిన నాన్న చేతికందించాను. నా వైపు, చీటీ వైపు మార్చి మార్చి చూస్తున్న నాన్నతో - "రాత్రి పిన్ని ఇచ్చింది నాన్నా" అన్నాను. ఇంకేం మాట్లాడకుండా ఆ చిన్న చీటీని గబగబా చదివారు. ఒకటికి పదిసార్లు. చూస్తుండగానే గిరుక్కున వెనక్కు తిరిగి గబ గబా బయటకు నడిచి ఒక్క ఉదుటున కళ్యాణినెక్కి క్షణంలో మెరుపులా మాయమైపోయారు. నా ముందు నాన్న చదివి పడేసిన కాగితం గాలికి రెపరెప లాడుతోంది. అందరూ లోపలికి



జోకిస్టు నరహరిని అడిగాడో వ్యక్తి-

"ఈ మధ్య మీరు జోక్స్ రాయడం మానేశారేం?"

"మా వీధిలో సర్క్యులేటింగ్ లైబ్రరీ మూసేశారు!" చెప్పాడు నరహరి.

\- గొంటు శ్రీనివాస్[కవిటి]

వచ్చారు. ప్రక్కింటి మోహన్ ఆ చీటీ చేతిలోకి తీసుకొని పైకి చదివాడు.

పూజ్యులైన శ్రీవారికి

కడసారి నమస్కృతులు

అనురాగంతో మీరు భార్యగా చేరదీసినా, లోకం నన్ను మీ భార్యగా చూడటం లేదు. లోకంలోనే - లోకుల మధ్యలోనే బ్రతకాల్సిన మనం తప్పనిసరిగా లోకుల మాటకు విలువ ఇవ్వాలి. నా ఒక్కదాని సంతోషం కోసం, ఇంతమందిని ఉసురుపెట్టడం నాకు చేతకావడం లేదు. ఈ విశాలమైన ప్రపంచంలో "ఉంపుడుకత్తె" కంటే హీనమైన స్థానం ఇంకేదీ లేదని ఈ కొద్ది రోజుల్లోనే అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. అనురాగం ఒక్కటే కాదు... హక్కు కూడా ఉండాలి. "తనది" అనుకున్న ఆడదానికి - అది లేనపుడు, ఆ స్త్రీకి బ్రతుకు వ్యర్థం. అందుకే వచ్చే జన్మకైనా ఆ హక్కు ప్రసాదించమని భగవంతుని ప్రార్థించేందుకు ఆయన సన్నిధికి వెళుతున్నాను. నాకు శాంతి కలగాలని ఆశీర్వదించండి.

'మీది' కావాలని,

కాలేకపోయిన యశోద.

[నన్ను మరిచిపోకండి. నేను ఎక్కడికీ పోను. మీలోనే ఉంటాను. క్షణక్షణం అలమటించిపోతూ ఉండే నా హృదయానికి అమృతం లాంటి ఆత్మీయత కురిపించి. తన పసితనపు చేష్టలతో నన్ను మురిపించిన సంజకి నా నిండైన ఆశీస్సులు. మీకు, మిగతా పెద్దలకు నా తుది నమస్కారములు].

'మీ

యశోద'

బాపురమని ఏడ్చాను! ఇంట్లో అందరూ కూడా ఉత్తరం చదివాక కొంచెం కన్నీళ్ళు కార్చారు! సాయంత్రం ఔతుండగా... సర్వం కోల్పోయిన వాడిలా... రక్తం గడ్డకట్టినట్లున్న మొహంతో.. నీరసంగా ఎద్దుల బండిలోంచి దిగుతున్న నాన్న సన్నిధికి పరుగెత్తబోయి... బండిలో గడ్డి మీద.... నిర్లిప్తంగా నిద్రపోతున్న పిన్నిని చూసి 'పిన్నీ' ఆవేశం, ఆనందం, ముప్పిరిగొనగా అరిచాను. నాన్న నన్ను గుండెలకు హత్తుకున్నారు. పిన్నిని నలుగురైదుగురు బయటకు తెచ్చారు. బెదిరిపోయాను నేను. ఏమైంది.. పిన్నికి-? నాన్నా... పిన్నికేమైంది? ఆత్రంగా నాన్న గడ్డం పట్టుకున్నాను! కనుకొనుకుల్లో నిలిచిన నీళ్ళతో సూటిగా పిన్ని వైపు చూస్తూ గద్గదంగా అన్నారు నాన్న. "నీ పిన్ని.. దేవుడి దగ్గరకు వెళిందిరా!" అని! నాకు.. నాకు... అర్థం కాలేదు. తెలియని భయంతో ఏడుస్తున్న నన్ను మోహన్ బయటకు తీసికెళ్లాడు.

ఇక పిన్ని లేదు! క్రమంగా పిచ్చివాడిలా ఉన్న నాన్న కోలుకున్నారు. ఒక ఆరు నెలలపాటు అసలు ఊళ్ళోకే రాలేదు నాన్న! ఇల్లూ - సంసారం - తాళికట్టిన భార్య, కని పెంచిన తల్లీ, కనుకున్న సంతానం, నాన్న తెంచుకోవాలనుకున్నా తెగని బంధాలు... నాన్నమళ్ళీ మనిషయ్యారు! కాని... అందమైన కళ్ళు ఎవరివైనను చూస్తే చాలు... ఆ రోజు పిచ్చివారైపోతారు నాన్న... ఎవరైనా లేచి వచ్చిన స్త్రీ అంటే చాలు... వెర్రిగా వాళ్ళ వైపు చూస్తాడు నాన్న!

పిన్ని మాట నిలుపుకుంది. పిన్ని ఎక్కడకూ పోలేదు! ఇతరులెవ్వరికీ కనిపించకుండా నాన్న గుండెల్లోనే మందిరం కట్టుకుంది! అలానే పసిదాన్నయిన నాలోనూ!!

ఇప్పుడు చెప్పండి! పిన్ని చేసిన చిన్న తప్పుకు ఎంత శిక్ష విధింపబడ్డదో చూశారా! ఏం ఆశించి వచ్చింది పిన్ని! ఎన్ని సహించింది? ఎంత... అవమానాన్ని భరించింది! ఎలాంటి పరిస్థితులకెలా ఎదురు నిలిచింది! కాని ఆమెకు లభించిందేమిటి-! ఏమీ లేదు! అంతులేని అవమానం! మాయని మచ్చ! కాని ఇంత దురదృష్టంలోనూ, ఆమెకు మిగిలిన ఆత్మసంతృప్తి... ఒక్కటే... ఎవరేమన్నా...ఏమైనా... తనను దేవతగా ఆరాధించాడు - ఆమె దేవుడు! ఈ ఫలితానికి కారణమెవరంటారు! పిన్నా - ? నాన్నా - ? లేక అమ్మా? కాదు ఎవరూ కాదూ! అనాదిగా వస్తున్న మన ఆచార సంప్రదాయాలు!! తాళికి ఉన్న విలువ ఇంక దేనికీ లేదు! తాళి లేని స్త్రీది ఎగతాళి బ్రతుకే!

పిన్ని నాకు కడసారిగా ఆశీస్సులందజేసింది! అమ్మ కసుర్తూ ఉంటే అమ్మ కళ్ళల్లో - ఠీవి... నేను వారి భార్యను అనే ఆ దర్పం... ప్రతి మాటలో కనిపించే ఆ అహంకారం... ఇప్పుడు నాకు వేయి కంఠాలుగా వినిపిస్తూంది! నిస్సహాయంగా బిక్కు బిక్కుమంటూ నిలబడ్డ పిన్ని... నా కళ్ళముందు ఈ క్షణాన కనిపిస్తే ఏం చెప్తుందో నాకు తెలుసు... "వద్దమ్మా సంజా? ఇంత అవమానం. ఏ ఆడదానికీ వద్దు. ఇంకతంటే కళ్ళు మూసుకుని ఏ గంగలోనైనా దూకటం ఉత్తమం. 'ఉంచుకున్నది' అని అనిపించుకోవడం ఎంత జుగుప్సాకరంగా ఉంటుందో చెప్పలేను" అంటుంది.

అందుకని రఘు గారు.. సామానాన నన్ను వదిలేయండి. నా జీవితంలో ఇక 'పెళ్ళి' అనే మాట లేదు. మీరు మీ భార్యా పిల్లలతో సుఖంగా ఉండండి. ఎప్పుడైతే మీకు పెళ్ళి అయింది అనే మాట తెలిసిందో... అప్పుడే, అమ్మ రూపం కళ్ళ ముందు నిలిచింది.. యశోద పిన్ని.. వద్దు.. వద్దు.. అంటూనే ఉంది మనసులో!

[ఇక దయ ఉంచి మన ఇద్దరి మధ్యా... ఈ విధమైన సంబంధం ఏమీ ఉండదు. నేను ఈ నిర్ణయానికి వచ్చేశాను. ఎక్కడ ఎప్పుడు కలిసినా... మీ భార్యా పిల్లలతో కలిసి ఉండాలి మీరు.]

నేనేమైపోతానో అని దిగులు పడకండి. నాకు ఆత్మవిశ్వాసం ఉంది. నేను ఒంటరిగానే ఈ జీవితాన్ని నెట్టుకు రాగలను.

శుభాకాంక్షలతో

**సంజరితా దేవి**